క్లుప్తంగా

సక్రమంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సరఫరాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని శ్యాంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన అక్కడి చిన్నారుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గుర్ల గెడ్డ ప్రాజెక్టును పూర్తి చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత రాజప్పలనాయుడు

మెంటాడ: గుర్ల గెడ్డ ప్రాజెక్టును పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి రాజప్పలనాయుడు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల పక్ష భేటీకి హాజరైన ఆయన దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ నిర్మాణం ప్రారంభించారని, ఇప్పటివరకు పూర్తి కాలేదని తెలిపారు. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు నిర్మాణం పూర్తవ్వలేదన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే దాదాపు 950 ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్ ఆధునీకరణకు నిధులు కేటాయించినా ఇంతవరకు ఎందుకు పనులు జరగలేదో తెలియడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని, పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంథ్రేటి అప్పలనాయుడు, దంతులూరి చంటి, పాశల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మెంటాడ: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మండల గృహసారథుల కన్వీనర్ కనిమెరక త్రినాథ్ కోరారు. మంగళవారం మండలంలోని మెంటాడ, లోతుగెడ్డ, ఆంద్ర గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమైన ఆయన ఈ నెల ఏడో తేదీ నుంచి జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల్లో మళ్లీ పార్టీ అధికారమే లక్ష్యంగా చేపట్టే ఈ కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ కిట్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీపీ ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సమగ్ర సమాచారం

రాజాం: అన్ని పంచాయతీ కార్యాలయాలతో పాటు అన్ని శాఖల కార్యాలయాల్లో ఆయా కార్యాలయాల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆయన సమాచార హక్కు చట్టంపై కలెక్టర్ సూర్యకుమారి అందించిన వివరాలను నోట్ చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ప్రజలు ఏ విభాగానికి సంబంధించి, సమాచారం ఎప్పుడు అడిగినా వెంటనే మనం ఇచ్చేలా ఉండాలని తెలిపారు. ప్రతీ సచివాలయంలో ఆర్‌టీఐ విభాగం ఉండాలని, ముందుగానే సమాచారం అందుబాటులో ఉంచి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు.

బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: రాజాం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా బి.మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.రమణమూర్తి, ఎన్నికల అధికారి ఎస్.పోలారావుల ఆధ్వర్యంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా డి.భవానీప్రసాద్, జనరల్ సెక్రటరీగా డోల కిరణ్‌బాబు, జాయింట్ సెక్రటరీగా నక్క మురళీధర్, లైబ్రరీ సెక్రటరీగా డి.గిరిజాప్రసాద్, ట్రెజరర్‌గా ఎ.సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్



రాజాం సిటీ: వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మహిళల ప్రగతికి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు వివిధ సభలు, సమావేశాలు, సదస్సులలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఓదార్పు యాత్ర మొదలుకుని, ప్రజాసంకల్ప యాత్ర వరకు జనానికి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు. మహిళాభ్యున్నతే ధ్యేయంగా అన్ని రంగాల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ పదవుల్లోనూ వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళలు స్వయం ఉపాధి సాధించి, వారు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు రూ.75 అందిస్తున్నారన్నారు. మహిళలు కూడా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. అధికార దాహం తీరని పార్టీలు, నాయకులు ఓట్ల కోసం అడ్డదారులు తొక్కుతుంటారని, మీకు నచ్చిన.. మీరు మెచ్చిన జీవితాన్ని ఇచ్చిన వారినే ఎన్నుకోవాలని అనగా, మహిళలంతా ఒక్కసారిగా జై జగన్ అని నినాదాలు చేయడం విశేషం.

రూ.10.32 కోట్లు జమ..

ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ రేగిడి మండలంలో 1,408 డ్వాక్రా గ్రూపుల్లోని 15,017 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.10.32 కోట్ల నగదు జమచేయడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ ఎన్నికలప్పుడు లేనిపోని హామీలు ఇచ్చి, ఆ తర్వాత అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిన చంద్రబాబు నాయుడు లాంటి నాయకులను నమ్మవద్దని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.ఇందుమతి, ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవరి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ చిరంజీవి, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు, తహసీల్దార్ టి. కల్యాణచక్రవరి, ఏపీఎం టి.మంగమ్మ, ఎమ్.ఎమ్.ఎస్ అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

డెయిరీ ఫాం పెట్టుకున్నాను..



నాకు వస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం నగదు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పటివరకు రెండు విడతల ద్వారా అందిన సొమ్ముకు మరికొంత జోడించి, పాడిఆవులు కొనుగోలు చేసి,డెయిరీ ఫాం పెట్టుకున్నాను. వచ్చే డబ్బులతో కుటుంబం మొత్తాన్ని పోషించుకోగలుగుతున్నాను.

– కోట్ల గౌరి, పెద్దశిర్లాం.

ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల ద్వారా అందిస్తోన్న నగదుతో ఆర్థిక ఇబ్బందులు తగ్గాయి. డ్వాక్రా రుణం కొద్దికొద్దిగా విడతల వారీగా మాఫీ అవుతుండగా, వైఎస్సార్ చేయూత పథకం డబ్బులతో చిన్నిచిన్న అప్పులు తీరుతున్నాయి. సీఎం జగన్‌ను మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

– పున్నాన పార్వతి, కందిశ



రేగిడి: వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం..

రాజాం సిటీ: మహిళల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కుల పంపిణీకి హాజరైన వారు మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే ఇంటితో పాటు రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. దీనికోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు పెట్టుబడులతో ప్రోత్సహిస్తుండడంతో పాటు విద్య, ఉద్యోగ, రాజకీయ పదవుల్లో కూడా విస్తృతంగా అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు లేనిపోని హామీలతో ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు సీఎం జగన్ మాత్రం తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు సభలు, సమావేశాల్లో ఇచ్చిన ఇంకెన్నో హామీలను నెరవేరుస్తున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. మరోసారి సీఎం జగనన్ననే గెలిపించాలన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును విడుదల చేశారు. దీంతో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద మండలంలోని 1141 మహిళా సంఘాల 11785 మంది సభ్యుల ఖాతాలకు రూ.8.38 కోట్లు జమ అయ్యాయన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాజాం మండలానికి మొత్తం రూ.25.13 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.సులోచన, జెడ్పీటీసీ బి.నర్సింహులు, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్.వర్షిణి, వై.సునీత, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, ఎమ్.ఎమ్.ఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణ, ఏపీ ఎ.చిరంజీవి, ఎంపీడీఓ బి.శంకరరావు, ఐసీడీఎస్ పీఓ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి..



ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా మహిళలమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అవస్థలు పడ్డాం. ఇప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమచేస్తుండడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీ మళ్లీ జగనన్నే సీఎంగా కావాలి. జగనన్నకు మేమంతా రుణపడి ఉంటాం.

– జి.గౌరీశ్వరి, గడిముడిదాం.

భరోసా దొరికింది..



ఇచ్చిన మాట ప్రకారం అనుకున్న సమయానికి రుణాలు మాఫీ చేయడం గొప్పవిషం. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో నాకు రూ.27 వేలు లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా దొరికింది. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకే మా మద్దతు. ఇదే ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటాం.

– కె.సూర్యప్రభ, బొద్దాం.

40 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు



వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: రైతులకు 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు వెళ్లిన వారు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. అనంతరం వాటి గురించి సమగ్ర సమాచారం వ్యవసాయ విస్తరణాధికారి దమయంతిని అడిగి తెలుసుకున్నారు. తొలుత రైతు 10 శాతం వాటాను పెట్టుబడిగా పెడితే 50 శాతం రుణం, 40 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. ఇక్కడ ట్రాక్టర్, బుల్ రోటోవేటర్, చాప్‌కట్టర్, 12 ప్లేట్ల డిస్క్, హోరో వంటి పరికరాలు ఉన్నాయని, సీహెచ్‌సీ గ్రూపులకు వీటిని మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు ఉన్నారు.

జోరుగా పెన్షన్ల పంపిణీ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పెన్షన్ల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, పెన్షన్లు అందజేస్తున్నారు. అనారోగ్యం రీత్యా బంధువుల ఇంట్లో, వైద్యసేవలు, చికిత్స నిమిత్తం ఆస్పత్రుల్లో ఉన్న వారి వద్దకు కూడా వలంటీర్లు వెళ్లి, పెన్షన్ అందిస్తుండడం విశేషం. మంగళవారానికి రామభద్రపురంలో 88 శాతం, బాడంగిలో 82 శాతం, తెర్లాం మండలంలో 90 శాతం మేర పెన్షన్ల పంపిణీ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: చొక్కాపు వీధిలో పెన్షన్లు అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ తవిటినాయుడు, వలంటీర్



తెర్లాంలో బయోమెట్రిక్ ద్వారా పెన్షన్ ఇస్తున్న వలంటీర్ కుమారి



బాడంగి: ఆనవరంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రామభద్రపురం: సూచనలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి శిరీష



రాజాం సిటీ: ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యాధికారి భార్గవ్

రామభద్రపురం: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎ.ఎల్.జి.శిరీష తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ చిన్నికృష్ణతో కలిసి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశమైన ఆమె గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. వీటినే గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రభుత్వ రూపొందించిన వాయిస్ కాల్స్, ఐవీఆర్ఎస్ ద్వారా గర్భస్థ వివరాలు నమోదు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం చాలా మంచిదని, వాటిని తప్పనిసరిగా తినాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు రక్తహీనత బారినపడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని పొగిరి పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.భార్గవ్ మంగళవారం సమావేశమై, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కిల్కారి మొబైల్ వాయిస్ వినిపించారు. దీనిలో గర్భిణులు, బాలింతల ఆరోగ్య జాగ్రత్తలు వివరించడం జరగ్గా, వీటినే గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు వినిపించాలని సూచించారు.

కొండగూడేంలో గ్రామసభ

సంతకవిటి: మండలంలోని కొండగూడేం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గత నాలుగు రోజులుగా ఇదే పంచాయతీ పరిధిలోని కొండగూడేం, మాధవరాయపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సోషల్ ఆడిట్‌లో గుర్తించిన విషయాలను చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు, ఏపీఓ త్రినాధరావు, ఈసీ మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

సంతకవిటి: మండలంలోని షాలీపేట మామిడితోటలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సిరిపురపు మంజుల ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులంతా హాజరు కావాలని కోరారు.

మెనూ ప్రకారం వంటకాలు



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని మీసాల డోలపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని, వంటకాలన్నీ రుచి, శుచితో ఉండాలని సూచించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాల మెరుగునకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. మంగళ, గురు, శనివారాల్లో తప్పనిసరిగా రాగిజావ విద్యార్థులకు అందజేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో యువతకు మేలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు రాలేదన్న టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబీ నాయన ఆరోపణలను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఖండించారు. ఇదే విషయమై మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన టీడీపీ నేతలు అభద్రతాభావంలో పడి, ఎవరు ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇంత అభివృద్ధి చేస్తున్నా, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ఏమీ చేయడం లేదని అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో దాదాపు 6,16,323 ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం టీడీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమ విమర్శించారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో 2008, 1998 డీఎస్సీ అభ్యర్థులకు కూడా తమ ప్రభుత్వమే ఉద్యోగాలు ఇచ్చిన విషయం మర్చిపోకూడదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కింద బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో రెండు స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా దాదాపు 700 మంది యువతకు జాబ్‌మేళా ద్వారా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలిచ్చిన, ఇస్తున్న, ఇస్తోన్న ప్రభుత్వం కూడా తమదేనన్నారు. ఓ అబద్ధాన్ని పదేపదే పదిసార్లు చెబితే నిజమైపోతుందన్న భ్రమలో ఆ పార్టీ నాయకులు బతుకుతున్నారని, అయితే నిజనిజాలు ఏమిటో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇప్పటికైనా టీడీపీ అనవసర విమర్శలు మానుకుని, వాస్తవంలో జీవించాలని హితవుపలికారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇక్కడి నా విజయం నుంచే పార్టీ 175 అసెంబ్లీ స్థానాల్లో విజయ లక్ష్యం చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి అసెంబ్లీ స్థానంలో నాకు పోటీగా బరిలో మీరు దిగుతారో, మీ అన్న దిగుతారో తేల్చుకోవాలని బేబీ నాయనకు సవాల్ విసిరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

రాజాం: స్థానిక పట్టణంలోని బుచ్చింపేట, బాబానగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పరిశీలించారు. అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలని, సిబ్బంది ఆ విధంగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈ రత్నాకర్ ఉన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

‘జగనన్నే మా భవిష్యత్’పై దిశానిర్దేశం

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ నేతలు పార్టీ శ్రేణులకు మంగళవారం దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ ఏడో తేది నుంచి జరిగే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు వివరించాలన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేసి, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని, 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



వంగర: మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ విజయలక్ష్మి



బొబ్బిలి: గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



బాడంగి: వీరసాగరంలో ట్యాబ్ సాయంతో కార్యక్రమంపై దిశానిర్దేశం చేస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ శంకరరావు



రామభద్రపురం: కోటశిర్లాం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు



తెర్లాం: జగనన్నే మా భవిష్యత్ కరపత్రాలు, వాల్ స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు